ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

18 ఏళ్ల నిరీక్షణ తర్వాత.. కల్కి ధామ్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన

2లో..

సంపుటి: 1 | సంచిక: 316 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 20 ఫిబ్రవరి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

హస్తినకు సీఎం రేవంత్

మంత్రివర్గ విస్తరణతో పాటు నామినేటెడ్ పోస్టుల భర్తీ, ఎంపీ టికెట్ల కేటాయింపుపై కూడా చర్చించే అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హస్తినకు పయనమయ్యారు. పార్టీ పెద్దలతో రేవంత్ రెడ్డి వరుసగా భేటీ కానున్నారు. త్వరలో లోక్ సభ ఎన్నికలు జరగనుండటం.. కేబినెట్ విస్తరణ కూడా చేపట్టనున్నారన్న వార్తలు వస్తుండటంతో.. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ఇప్పుడు సర్వత్రా ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా.. ఢిల్లీ పెద్దలతో.. మంత్రివర్గ విస్తరణతో పాటు నామినేటెడ్ పోస్టుల భర్తీ, ఎంపీ టికెట్ల కేటాయింపుపై కూడా చర్చించే అవకాశమున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అయితే.. ముఖ్యంగా కేబినెట్ విస్తరణ విషయంపైనే అధిష్ఠానంతో రేవంత్ రెడ్డి చర్చించనున్నారని టాక్ నడుస్తోంది. ప్రభుత్వ ఏర్పాటు సమయంలోనే.. 11 మంది మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ అధిష్ఠానం.. మరో ఆరు మంత్రు పదవులను కూడా భర్తీ చేయాలని యోచిస్తోంది. అది కూడా లోక్ సభ ఎన్నికలకు ముందే భర్తీ చేయాలనుకుంటున్నట్టు సమాచారం. కాగా.. రేవంత్ రెడ్డిని పూర్తిగా నమ్ముతున్న అధిష్ఠానం.. తన టీంను సెలెక్ట్ చేసుకునేందుకు కూడా పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్టు తెలుస్తోంది. మొదటి దశలో.. పలు సీనియర్లతో పాటు రేవంత్ టీంలోకి కొంత మందిని ఛాన్స్ ఇచ్చారు. కాగా... ఇప్పుడు ఆ ఆరు పదవులు ఎవరిని వరించనున్నాయన్నది ఆసక్తికరంగా మారింది. అయితే.. ఇప్పటికే ఆరుగురి పేర్లను సిద్ధం చేసిన రేవంత్ రెడ్డి.. కేవలం అధిష్ఠానం ఆమోదం కోసమే ఢిల్లీ వెళ్లినట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఎస్సీ వర్గానికి చెందిన భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగా ఉండగా.. రెండో డిప్యూటీ సీఎం పదవిని కూడా భర్తీ చేసేందుకు యోచిస్తున్నారు. దీంతో.. సామాజిక సమీకరణాల్లో భాగంగా మరో వర్గానికి ఆ పదవిని ..మిగతా 2లో

పప్వా న్యూ గునియాలో
గిరిజన తెగల మధ్య వార్
64 మంది మృతి

పోర్ట్ మోర్స్‌బీ, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం): పప్వా న్యూ గునియా దేశంలో జరిగిన హింసలో ..మిగతా 2లో

రైతు సంఘాలకు
కేంద్రం కొత్త ప్రతిపాదన
రెండు రోజుల పాటు ఢిల్లీ మార్చ్‌కు బ్రేక్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 19 (ప్రభాత ఉదయం): పంటలకు కనీస మద్దతు ధర కోసం పంజాబ్-హర్యానా సరిహద్దులో చేపట్టిన 'ఢిల్లీ చలో' ..మిగతా 2లో

ఢిల్లీకి గులాబీ బాస్ కేసీఆర్

పొత్తు కోసమా.. సపోర్ట్ కోసమా..? సర్వత్రా ఉత్కంఠ!

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం): తెలంగాణలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కాగా.. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లగా.. మాజీ సీఎం, గులాబీ బాస్ కేసీఆర్ కూడా హస్తినకు పయనమవుతున్నారు. అయితే.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత.. అనారోగ్యం కారణంగానో, లేదా ఇంకేదో కారణమో కానీ.. సైలెంట్ అయిపోయారు. అసెంబ్లీకి కూడా రాని కేసీఆర్.. ఇప్పుడు ఢిల్లీకి వెళ్తుండటం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. గులాబీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్.. ఏం చేసినా దాని వెనుక బలమైన రాజకీయ కోణం ఉంటుంది. ఆయన వేసే ప్రతి అడుగు ఎంతో వ్యూహాత్మకంగా ఉంటుంది. అలాంటిది.. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా ఓడిపోయి.. ప్రతిపక్షానికి పరిమితమయ్యారు. అయితే.. అప్పటి నుంచి ఇప్పటివరకు కేసీఆర్ పూర్తి స్థాయిలో యాక్టివ్ కాలేదు. తాజాగా నిర్వహించిన నల్గొండ సభ మినహా.. ఆయన అటు అసెంబ్లీ సమావేశాలకు గానీ.. ఇటు రాజకీయ కార్యక్రమాలకు గానీ హాజరుకాలేదు. అలాంటిది.. ఇప్పుడు ఢిల్లీకి పయనమవుతున్నారు గులాబీ బాస్. త్వరలో లోక్ సభ ఎన్నికలు జరగనుండటం.. ప్రాజెక్టుల విషయంలో రేవంత్ సర్కార్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తుండటం.. గులాబీ నేతలు కారు దిగి హస్తంతో దోస్తీ కడుతుండటం.. ఇవే కాకుండా ఈ మధ్య సోషల్ మీడియాలో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు అంశం తెగ వైరల్ అవుతున్న నేపథ్యంలో.. కేసీఆర్ ఢిల్లీ టూర్ సర్వత్రా ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే.. ఈ వారంలో గులాబీ బాస్ ఢిల్లీకి వెళ్లనున్నట్లు సమాచారం అందుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా ఢిల్లీకి కేసీఆర్ వెళ్తుండటంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇంతకూ కేసీఆర్ ఢిల్లీ ఎందుకు వెళ్తున్నారనేది క్లారిటీగా తెలియకపోయినా.. రాజకీయ వర్గాల్లో మాత్రం ఆసక్తికరమైన చర్చలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ..మిగతా 2లో

ఏపీ రాజకీయాల్లో మరో సంచలనం

రంగంలోకి తెలంగాణ సీఎం?

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం): త్వరలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఏపీ రాజకీయాలు ఆసక్తి రేపుతున్నాయి. ప్రధాన పార్టీలు ఇప్పటికే సభలు, సమావేశాలతో జనాలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. పోటాపోటీగా ర్యాలీలు తీస్తూ ఎన్నికల రేసులో దూసుకుపోతున్నాయి. అయితే ఏపీ కాంగ్రెస్ పార్టీ పగ్గాలు షర్మిల చేపట్టిన తర్వాత రాజకీయాలు మరింత ఆసక్తిగా మారాయి. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని పెంచే ప్రయత్నంలో ఆమె గత వారం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిసి సమకాలీన రాజకీయ అంశాలపై చర్చించారు. షర్మిల ఢిల్లీ వెళ్లి సోనియా గాంధీని కలిసిన తర్వాత ఈ భేటీ జరిగింది. తాజా బజ్ ప్రకారం.. ఎన్నికల ప్రచారం ఫైర్ బ్రాండ్ ..మిగతా 2లో

ఈడీ విచారణకు కేజ్రీవాల్
ఆరోసారి డుమ్మా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 19 (ప్రభాత ఉదయం): మద్యం కుంభకోణం కేసులో అరవింద్ కేజ్రీవాల్ మరోసారి ఈడీ విచారణకు గైర్హాజరయ్యారు. ఎక్సైజ్ పాలసీకి సంబంధించి కేసులో సోమవారం ఆయన విచారణకు హాజరు కావాలని ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఆరోసారి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ విచారణకు కేజ్రీవాల్ హాజరుకావడం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు వెల్లడించాయి. సమన్లు చట్ట వ్యతిరేకమని, ఈడీ సమన్ల చట్టబద్ధతపై కోర్టులో కేసు నడుస్తోందని ఆప్ వర్గాలు మండిపడ్డాయి. ఇబ్బంది పెట్టేందుకే ఈడీ పదే పదే సమన్లు ..మిగతా 2లో

టీఎస్‌పీఎస్సీ 'గ్రూప్-1'
నోటిఫికేషన్ విడుదల

563 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 23 నుంచి దరఖాస్తులు

రెండు సార్లు గ్రూప్ 1 నోటిఫికేషన్ రద్దు..

ఉద్యోగ పరీక్షల వయోపరిమితి పెంపు..

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం): తెలంగాణలో గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. మొత్తం 563 పోస్టుల భర్తీకీ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫిబ్రవరి 19న నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 23 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభంకానుంది. డిగ్రీ అర్హత ఉన్న అభ్యర్థుల గ్రూప్-1 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అభ్యర్థుల నుంచి మార్చి 14 వరకు ..మిగతా 2లో

మూసీ అభివృద్ధిపై
సీఎం సమీక్ష
రేవంత్ కీలక ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం): మూసీ నది అభివృద్ధి ప్రక్రియను వీలైనంత త్వరగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూసీ అభివృద్ధి పనులపై చర్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మూసీ నది పునరుద్ధరణ, సుందరీకరణ పనులను ప్రారంభించే ముందు మూసీ నది ప్రక్షాళన చేపట్టాలని, రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులను మూడు నెలల్లో ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సోమవారం అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం నానక్‌రామ్‌గూడలో హెచ్ఎండీఏ అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి రివర్ ఫ్రంట్ అభివృద్ధిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మూసీ లొకేషన్ స్కెచ్, హద్దులు, ఇతర ముఖ్య వివరాలను రేవంత్ పరిశీలించి, చార్మినార్ వంటి చారిత్రక కట్టడాలు ఉండేలా అభివృద్ధి ప్రణాళికను ..మిగతా 2లో

సీఎం రేవంత్ కొత్త జీవోను వ్యతిరేకిస్తూ..
సోనియాకు ఎమ్మెల్సీ కవిత లేఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. ఉపాధి అవకాశాల్లో మహిళలకు రిజర్వేషన్లపై కాంగ్రెస్ అవలంభిస్తున్న వైఖరిపై విమర్శలు గుప్పించారు. రిజర్వేషన్ల స్ఫూర్తిని పక్కనబెడుతూ సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు సమాంతర రిజర్వేషన్లు అంటూ ఫిబ్రవరి 10న కొత్త జీవో తీసుకురావడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. ఆడబిడ్డల హక్కులను కాంగ్రెస్ తుంగులో తొక్కుతుందని, ఈ అంశంపై జాతీయ పార్టీ వైఖరి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. '1996లో అనేక పోరాటాల ఫలితంగా మహిళలకు ఉపాధి అవకాశాల్లో 33.3 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో నంబర్ 41, 56 జారీ అయ్యాయి. దీనికి 1992లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఇందిరా సాహ్నీ తీర్పు కూడా ఎంతో తోడ్పాటునిచ్చింది. ఆ తర్వాత రాజ్యాంగబద్ధంగా మహిళలకు రోస్టర్ పాయింట్లతో కూడిన హారిజాంటల్ రిజర్వేషన్లు కల్పించారు. మన దేశంలో సామాజిక రిజర్వేషన్లు ఎలా అయితే ఉన్నాయో మహిళలకు 33 శాతం ..మిగతా 2లో

నేటి నుంచి బీజేపీ విజయ సంకల్ప రథయాత్ర

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్రంలో విజయ సంకల్ప రథయాత్రకు బీజేపీ శ్రీకారం చుట్టనుంది. నేడు రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ విజయ సంకల్ప రథయాత్రను ప్రారంభిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ చేపట్టబోయే విజయ సంకల్ప యాత్ర గురించి వివరాలు వెల్లడించారు. 'నేటి నుంచి విజయ సంకల్ప రథ యాత్ర ప్రారంభం కానుంది. నేడు నాలుగు యాత్రలు ప్రారంభం కానున్నాయి .కోమరంభీం యాత్ర బాసర సరస్వతి అమ్మవారి ఆశీస్సులతో యాత్రం ప్రారంభం అవుతుంది. రాజరాజేశ్వరీ విజయ సంకల్ప యాత్ర కరీంనగర్, మెదక్, జహీరాబాద్, చేవెళ్ల నాలుగు పార్లమెంట్ స్థానాలను కవర్ చేస్తూ యాత్ర కొనసాగనుంది. ఇందులో 22 అసెంబ్లీలు కవర్ చేయనుంది. మిగిలిన నియోజక వర్గాలను సైతం కవర్ చేసేందుకు కృషి చేస్తాం. భాగ్యలక్ష్మి విజయ సంకల్ప యాత్ర.. యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆశీర్వాదంతో ప్రారంభం అవుతుంది. భువనగిరి, మల్కాజ్‌గిరి హైదరాబాద్, సికింద్రాబాద్ కవర్ చేస్తూ.. యాత్ర కొనసాగనుంది. కృష్ణ విజయ సంకల్ప యాత్ర మక్తల్ లో కృష్ణ గ్రామం నుంచి ప్రారంభం కానుంది. మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు, నల్గొండ కవర్ చేస్తూయాత్ర కొనసాగనుంది. కొమరం భీం యాత్రనుఅస్సాం సీఎం హేమంత్ బిస్వా శర్మ ప్రారంభిస్తారు. రాజరాజేశ్వరీ యాత్ర తాండూర్‌లో ప్రారంభం కానుంది. దీనికి కేంద్రమంత్రి బీఎల్ వర్మ హాజరుకానున్నారు. భాగ్యలక్ష్మీ యాత్రకి గోవా సీఎం ప్రమోద సావంత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కృష్ణ యాత్రకు కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల హాజరవుతారు. యాత్రలో రోడ్ షో లు ఎక్కువ ఉంటాయి. ఐదు యాత్రలు కలిపి 5500 కి.మీలు కవర్ కానుంది. 114 అసెంబ్లీ కవర్ అయ్యేలా కవర్ యాత్ర ఉండనుంది. 106 రోడ్ షో లు ఉండనున్నాయి' అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

హస్తినకు సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి...

కట్టబెట్టాలనుకుంటున్నారు. బీసీ లేదా మైనారిటీ వర్గానికి చెందిన నేతకు పదవి ఇవ్వాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. రెండో డిప్యూటీ సీఎంకు కీలకమైన హోం శాఖతో పాటు మరో రెండింటిని కూడా కేటాయించనున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంమైన బీఆర్ఎస్‌లోనూ మైనార్టీ వర్గానికి చెందిన మహమూద్ అలీ డిప్యూటీ సీఎంగా, హోంమంత్రిగా పని చేసిన విషయం తెలిసిందే. కాగా.. ఇప్పుడు కూడా అదే సెంటిమెంట్ రిపీట్ కానున్నట్టు తెలుస్తోంది. కాగా.. ఇటీవల ప్రొఫెసర్ కోదండరాం, సీనియర్ జర్నలిస్టు మీర్ అమీర్ అలీఖాన్‌ను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా నియమించారు. ఎన్నికల్లో పొత్తు సమయంలో ఇచ్చిన మాట మేరకు.. కోదండరాంకు ఓ మంత్రి పదవి ఇవ్వాలని ఫిక్స్ అయింది నాయకత్వం. దీంతో.. ఆయనకు విద్యాశాఖ ఇచ్చే ఛాన్స్ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఇక అమీర్ అలీఖాన్‌ను మైనార్టీ విభాగంలో డిప్యూటీ సీఎం ఇవ్వనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. నిజానికి షబ్బీర్ అలీని ఎమ్మెల్సీగా చేసి మంత్రి పదవి ఇస్తారని అంతా అనుకున్నా.. ఆయనకు కేబినెట్ ర్యాంకుతో కూడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సలహాదారు పదవిని ఇచ్చారు.దీంతో మైనార్టీ వర్గానికి చెందిన అమీర్‌కు డిప్యూటీ సీఎం ఇవ్వనున్నట్టు సమాచారం. ఇక మిగిలిన మంత్రి పదవులకు బీసీ కోటాలో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీహరి ముదిరాజ్ (మక్తల్) ఇచ్చేందుకు అవకాశముండగా.. రెడ్డి వర్గానికొస్తే మల్‌రెడ్డి రంగారెడ్డి, టి. రామ్మోహన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. ఈ ముగ్గురిలో ఇద్దరికి ఇచ్చే ఛాన్స్ ఉంది. మరోవైపు.. వెలమ సామాజిక వర్గం నుంచి ప్రేం సాగర్ రావు, మదన్ మోహన్ రావు కూడా పోటీలో ఉండగా.. ఎస్సీ సామాజికవర్గం నుంచి జి. వివేక్, జి. వినోద్ సోదరులు కూడా పదవులు ఆశిస్తున్నారు.

టీఎస్‌పీఎస్సీ 'గ్రూప్-1' నోటిఫికేషన్ విడుదల

మొదటి పేజీ తరువాయి...

దరఖాస్తులు స్వీకరించనున్నారు. గత ప్రభుత్వం జారీచేసిన నోటిఫికేషన్‌ను రద్దుచేసిన ప్రభుత్వం తాజాగా గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణలో గత ప్రభుత్వం 503 పోస్టులతో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ ఫిబ్రవరి 19న రద్దు చేసిన సంగతి తెలిసిందే. పేపర్ లీక్ కావడంతో గ్రూప్ 1 నోటిఫికేషన్ రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే పాత ఖాళీలకు అదనంగా 60 పోస్టులను జతచేస్తూ మొత్తం 563 ఖాళీల భర్తీకి టీఎస్‌పీఎస్సీ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఇప్పటివరకూ ఒక్కసారి కూడా గ్రూప్ 1 పోస్టులు భర్తీ కాలేదు. రెండు సార్లు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ, భర్తీ ప్రక్రియ మాత్రం సజావుగా సాగలేదు. మొదట 2022 ఏప్రిల్ లో 503 గ్రూప్ 1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. కానీ ప్రిలిమ్స్ నిర్వహణ జరిగి, ఫలితాలు సైతం విడుదలయ్యాయి. మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తారని అంతా అనుకుంటున్న సమయంలో ప్రిలిమ్స్ ఎగ్జామ్ పేపర్ లీక్ అయ్యిందని ఆరోపణలు రావడంతో మొదట ప్రిలిమ్స్ ఎగ్జామ్ రద్దు చేశారు. దాంతో గ్రూప్ 1 నోటిఫికేషన్ తొలిసారి రద్దయింది. గతంలో టీఎస్‌పీఎస్సీ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ ఉపసంహరించుకుని, తాజాగా ఆ నోటిఫికేషన్‌ను రద్దుచేసి, కొత్త నోటిఫికేషన్ విడుదల చేసింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి గ్రూప్ 1 ప్రిలిమినరీ ఎగ్జామ్ నిర్వహించింది. తొలిసారి ఎగ్జామ్ నిర్వహించిన సమయంలో బయోమెట్రిక్ లాంటి విషయాలతో పాటు ఎంతో జాగ్రత్తగా ఎగ్జామ్ నిర్వహించారు. కానీ రెండోసారి నిర్వహించిన ఎగ్జామ్ లలో అవకతవకలు జరిగాయని, నిబంధనలు సరిగ్గా పాటించలేదని గ్రూప్ 1 ప్రిలిమినరీ మరోసారి రద్దు చేసింది టీఎస్‌పీఎస్సీ. విషయం హైకోర్టు వరకు వెళ్లడంతో ఎగ్జామ్ రద్దు నిర్ణయాన్ని సమర్థించింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును సైతం ఆశ్రయించింది. కేసు విచారణలో ఉండగానే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఉద్యోగ నియామక పరీక్షలకు సంబంధించి వయోపరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. వయోపరిమితిని 44 సంవత్సరాల నుంచి 46 ఏళ్లకు పెంచింది. అయితే యూనిఫామ్ సర్వీసులకు మాత్రం మినహాయింపునిచ్చింది. వయోపరిమితి నుంచి సడలింపు ఇచ్చింది. ఈ మేరకు నిర్దేశించిన గరిష్ట వయోపరిమితిని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో గ్రూప్-1 సహా చాలా పోటీ పరీక్షల కోసం నిరుద్యోగ యువత ఎదురుచూస్తోంది.

ఏపీ రాజకీయాల్లో మరో సంచలనం

మొదటి పేజీ తరువాయి...

నాయకుడు రేవంత్ రెడ్డిని ఏపీకి తీసుకురావాలని షర్మిల తన ప్రతిపాదనను సోనియా గాంధీకి అందించారు. ఈ ప్లాన్‌కు సోనియా ఆమోదం తెలిపారని, దానిని షర్మిల స్వయంగా రేవంత్ వద్దకు తీసుకెళ్లారని, ఆయన కూడా సానుకూలంగా స్పందించారని ఇంటర్నల్ టాక్. పర్యవసానంగా, ఏపీ ఎన్నికల ప్రచారంలో రేవంత్ ప్రవేశం ఇంకెంతో దూరంలో లేదు. షర్మిల ప్రస్తుతం తన కొడుకు రాజారెడ్డి పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. ఆమె ఫిబ్రవరి 20న కాంగ్రెస్ పెద్దల సమక్షంలో భారీ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. ఏపీలో రేవంత్ రెడ్డి బహిరంగ సభకు తిరిగి వస్తే, అది ఈ నెలాఖరులోగా కార్యరూపం దాల్చవచ్చు. ఫిబ్రవరి నెలాఖరులో వైజాగ్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు బ్లూప్రింట్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాత్రమే కాకుండా కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కూడా పాల్గొనే అవకాశం ఉంది. ఈ భారీ ఎన్నికల సభ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ మేనిఫెస్టోను కూడా సమావేశంలో ప్రకటించవచ్చు. కర్ణాటక, తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్‌లో పాగా వేయాలని గట్టిగా నిర్ణయించుకుంది. అయితే రేవంత్ రెడ్డి ఏపీ కాంగ్రెస్ కు మైలేజ్ తీసుకొచ్చేలా పనిచేయొచ్చు. ఇద్దరు మంచి వక్తలు షర్మిల, రేవంత్‌లను ఒకే వేదికపై చూడటం, ఏపీ కాంగ్రెస్ కార్యకర్తల్లో నూతన జోష్ నింపవచ్చు.

సీఎం రేవంత్ కొత్త జీవోను వ్యతిరేకిస్తూ..

సోనియాకు ఎమ్మెల్సీ కవిత లేఖ

మొదటి పేజీ తరువాయి...

రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేసే పద్ధతి నడుస్తోంది. ఇన్నేళ్ల నుంచి సాగుతున్న ఈ పద్ధతిని ఇటీవల రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణలోకి తీసుకొని తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల హక్కులను కాలరాస్తూ జీవో 41, 56ను రద్దు చేస్తూ ఈ నెల 10న కొత్తగా జీవో 3ను తీసుకువచ్చింది. రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీచేసినా.. తాము మహిళల హక్కులను హరించబోమని 2023 జనవరిలో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎవరితో సంప్రదింపులు జరపకుండా మహిళల హక్కులకు భంగం కలిగిస్తూ ఈ నెల 6న రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. తద్వారా మహిళల హక్కులను సంపూర్ణంగా, శాశ్వతంగా హరిస్తూ రోస్టర్ పాయింట్లు లేకుండా హారిజాంటల్ పద్ధతిలో రిజర్వేషన్లను కల్పిండానికి జీవో 3ను ప్రభుత్వం జారీ చేసింది. ఇది మహిళల ఉద్యోగావకాశాలకు శరాఘాతంగా నిలవనుంది. ఉదాహరణకు ఈ ఏడాది దాదాపు 2 లక్షల 50 వేల మంది ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో నమోదుచేసుకున్నారు. వారిలో లక్ష మంది ఆడబిడ్డలు ఉన్నారు. ఈ ఏడాది 2 లక్షల కొలువులు ఇస్తామని ప్రభుత్వం చెబుతుంనది. అంటే 33.3 శాతం రిజర్వేషన్ల మేరకు కనీసం 66 వేల మంది మహిళలకు ఉద్యోగాలు కచ్చితంగా రావాలి. అదనంగా మరింత మంది మహిళలకు ఉద్యోగాలు లభించాలి. అదే ఈ రిజర్వేషన్ల స్ఫూర్తి. దీనిని పక్కనబెడుతూ సీఎం రేవంత్ రెడ్డి కొత్త జీవో తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నాను. ఈ అంశంపై జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ వైఖరి ఏమిటో చెప్పాలి. సుప్రీంకోర్టు తీర్పును పాటించబోమంటూ బీహార్, కర్ణాటక రాష్ట్రాలు జీవోలు జారీ చేశాయి. కానీ తెలంగాణలో మాత్రం మీ గ్యారెంటీతో ఇందిరమ్మ రాజ్యంగా చెబుతూ ఏర్పడిన కొత్త ప్రభుత్వంలో ఇంటి ఆడబిడ్డలకు తీరని అన్యాయం జరుగుతోంది. ఈ విషయంలో జోక్యం చేసుకొని ఆ జీవోను తక్షణమే వెనక్కి తీసుకునేలా ముఖ్యమంత్రికి ఆదేశాలు జారీ చేయాలి' అని విజ్ఞప్తి చేశారు.

ఈడీ విచారణకు కేజ్రీవాల్

ఆరోసారి డుమ్మా

మొదటి పేజీ తరువాయి...

పంపుతోందని ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కోర్టు నిర్ణయం వచ్చేవరకు ఈడీ ఆగాల్సిందేనని స్పష్టం చేశారు. ఇప్పటికే ఐదు సార్లు ఈడీ విచారణకు గైర్హాజరైన కేజ్రీవాల్.. ఈ నెల 17న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈడీ కోర్టు విచారణకు హాజరయ్యారు. రాష్ట్ర బడ్జెట్, విశ్వాస తీర్మానం కారణంగా తాను ప్రత్యక్షంగా కోర్టుకు రాలేకపోయానని వివరించారు. మార్చి 16న జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరవుతానని తెలిపారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో ఈ నెల 19 సోమవారం విచారణకు హాజరుకావాలని అరవింద్ కేజ్రీవాల్కు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఇప్పటివరకు ఐదుసార్లు విచారణకు రావాల్సిందిగా ఆయనను ఈడీ కోరింది. కానీ ఒక్కసారి కూడా కేజ్రీవాల్ విచారణకు హాజరుకాకుండా డుమ్మా కొట్టారు. తనకు వ్యక్తిగత పనులు ఉన్నాయంటూ ఇప్పటివరకు ఆయన విచారణకు హాజరుకాలేదు. ఈడీ మాత్రం నోటీసులు పంపిస్తూనే ఉంది. అయితే విచారణకు రాని కేజ్రీవాల్పై ఈడీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. లోక్సభ ఎన్నికలు వస్తున్న క్రమంలో కేజ్రీవాల్కు ఈడీ నుంచి నోటీసులు వస్తుండటంపై ఆప్ వర్గాలు మండిపడుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం చేయనీయకుండా చేసేందుకు ఇలా పదే పదే నోటీసులు ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. కేజ్రీవాల్ను చట్టవిరుద్ధంగా అరెస్ట్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆప్ వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈడీ నోటీసుల వెనుక కేంద్ర ప్రభుత్వ కుట్ర ఉందని ఆరోపిస్తున్నారు. కేజ్రీవాల్ నోటీసులపై స్పందించకపోవడంతో ఫిబ్రవరి 3న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ పిటిషన్ దాఖలు చేసింది. ఉద్దేశపూర్వకంగానే విచారణకు డుమ్మా కొడుతున్నారని పిటిషన్లో పేర్కొంది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో అనేకమందిని ఇప్పటికే ఈడీ అరెస్ట్ చేసింది. ఈ కేసులో కేజ్రీవాల్పై కూడా అనేక ఆరోపణలు రావడంతో.. ఆయనకు నవంబర్ 1వ తేదీన తొలిసారి ఈడీ నోటీసులు ఇచ్చింది. ఆ తర్వాత డిసెంబర్ 21న మళ్లీ సమన్లు జారీ చేసింది. అయినా కేజ్రీవాల్ విచారణకు రాకపోవడంతో ఈ ఏడాది జనవరి 3, జనవరి 18న, ఫిబ్రవరి 2న నోటీసులు జారీ చేసింది. ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసినా కేజ్రీవాల్ పట్టించుకోవడం లేదు. కాగా లిక్కర్ స్కాంలో తన పాత్ర లేదని, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తనను ఇరికిస్తున్నారని కేజ్రీవాల్ కామెంట్ చేశారు. తాను తప్పు చేసినట్లు ఆధారాలు ఉంటే ఈడీ అరెస్ట్ చేసుకోవచ్చని, తాను భయపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. చట్టాన్ని తాను గౌరవిస్తానంటూ కేజ్రీవాల్ చెప్పుకొచ్చారు.

పప్వా న్యూ గునియాలో

గిరిజన తెగల మధ్య వార్

మొదటి పేజీ తరువాయి...

64 మంది మృతిచెందారు. ఆ దేశంలోని పర్వత శ్రేణుల్లో ఉండే రెండు గిరిజన తెగల మధ్య ఘర్షణ జరిగింది. ఓ దళం తమ వద్ద ఉన్న ఆయుధాలతో.. మరో తెగపై ఫైరింగ్ చేసింది. ఎంగ్వా ప్రావిన్సులో ఈ రక్తపాతం చోటుచేసుకున్నది. పర్వత ప్రాంతాల్లో చాన్నాళ్ల నుంచి వర్గ పోరు నడుస్తోంది. అయితే గత వారం చివరలో జరిగిన హింస మరీ దారుణమని అధికారులు చెబుతున్నారు. అక్రమంగా ఆ దీవిలో ఆయుధాలు వచ్చినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో స్థానిక గిరిజన తెగల మధ్య ఘర్షణ మొదలైంది. రాజధాని పోర్ట్ మోర్స్‌బీకి 600 కిలోమీటర్ల దూరంలో ఉన్న వాబాగ్ పట్టణంలో ఎక్కడ చూసినా మృతదేహాలు ఉన్నాయి. ఆ మృతదేహాలను పోలీసులు సేకరిస్తున్నారు. హైల్యాండ్స్ ప్రాంతంలో జరిగిన హింసలో ఇదే అతిపెద్ద ఘటన అని అధికారి జార్జ్ కాకస్ తెలిపారు. హింసాత్మక ఘటనకు చెందిన గ్రాఫిక్ వీడియోలు పోలీసులకు చేరాయి. కాల్పుల జరిగిన ప్రాంతానికి చెందిన ఫోటోలు కూడా రిలీజ్ అయ్యాయి. ట్రక్కుల్లో మృతదేహాలను లోడ్ చేస్తున్న దృశ్యాలు కలిచివేస్తున్నట్లు అధికారులు చెప్పారు. భూమి, సంపద కోసం గిరిజనుల మధ్య గొడవ జరుగుతోంది. అయితే గత ఏడాది జూలై నుంచి మూడు నెలల పాట ఆ ప్రాంతంలో లాక్‌డౌన్ కూడా విధించారు. హింస నేపథ్యంలో అక్కడ కర్ఫ్యూ, ట్రావెల్ ఆంక్షలు విధించారు. గత ఏడాది ఆగస్టులో కూడా అక్కడ భారీ హింస చోటుచేసుకున్నది. ఇటీవల జరిగిన కొట్లాటలో సుమారు 17 గిరిజన తెగలు ఇన్వాల్వ్ అయినట్లు తెలుస్తోంది. పప్వా న్యూ గునియాలో జరిగిన ఊచకోతపై పొరుగు దేశం ఆస్ట్రేలియా విచారం వ్యక్తం చేసింది. ఆ మారణహోమం చాలా డిస్టర్బింగా ఉన్నట్లు తెలిపింది.

ఢిల్లీకి గులాబీ బాస్ కేసీఆర్

మొదటి పేజీ తరువాయి...

జరిగిన అవినీతిని బయటపెట్టే పనిలో మునిగిపోయింది. ప్రధానంగా కాళేశ్వరంపై ఫోకస్ పెట్టింది. ఇటీవలే అసెంబ్లీలో ప్రాజెక్టులపై శ్వేతపత్రం కూడా విడుదల చేసి.. కేసీఆర్ వైఫల్యాలను ఎండగట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో భాగస్వామ్యమైన ఏ ఒక్కరిని వదిలిపెట్టేది లేదంటూ అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి హెచ్చరించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పొత్తు పెట్టుకోనున్నాయన్న అంశం.. ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్ అయ్యింది. ఇదే విషయంపై బీజేపీ నేతలు మాత్రం సరేమిరా అంటూ ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. కానీ.. బీఆర్ఎస్ నేతలు మాత్రం.. ఏదో వినీ విననట్టుగా సైలెంట్‌గా ఉంటున్నారు. ఈ వ్యవహారం చూస్తుంటే.. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ఒంటరిగా పోటీ చేసి కాంగ్రెస్ దూకుడును అడ్డుకోలేమని భావిస్తున్న కేసీఆర్.. పొత్తు వైపు అడుగులు వేస్తున్నారేమో అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అయితే.. రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో.. కేసీఆర్ ఉన్నట్టుండి ఢిల్లీకి పయనమవుతుండటంపై రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఢిల్లీ పర్యటన పొత్తు కోసమా.. లేక అవినీతి ఆరోపణల నుంచి తప్పించుకునేందుకు కేంద్రం సపోర్ట్ కోసమా అని మిగతా పార్టీ నేతలు కామెంట్లు చేస్తున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులోనూ.. కవితను తప్పించేందుకు మోదీతో కేసీఆర్ కుమ్మక్కయ్యారని గతంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపించిన విషయం తెలిసిందే. ఒకవేళ నిజంగానే.. ప్రాజెక్టుల విషయంలో సపోర్ట్ కోసమే అయితే.. కేటీఆర్, హరీశ్ లాంటి నేతలను పంపించినా సరిపోతుంది.. కానీ కేసీఆరే స్వయంగా రంగంలోకి దిగుతున్నారంటే.. కథ ఇంకేదో ఉందని చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉంటే.. ఎన్డీఏతో కలిసేందుకు చాలా పార్టీలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయని.. త్వరలోనే భారీగా చేరికలు ఉంటాయని హోం మంత్రి అమిత్ షా ప్రకటించటం.. ఈ క్రమంలోనే కేసీఆర్ ఢిల్లీ టూర్‌కు సిద్ధమయ్యారని వార్తలు రావటం సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే. మరి.. ఇంతకూ కేసీఆర్ వేసే అడుగు ఎలా ఉండబోతోందని అన్నది.. వేచి చూడాల్సిందే.

18 ఏళ్ల నిరీక్షణ తర్వాత.. కల్కి ధామ్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 19 (ప్రభాత ఉదయం): 'తాను నెరవేర్చేందుకే కొందరు మంచి పనులను తన కోసం వదిలి వెళ్లారని' ప్రధాని నరేంద్ర మోదీ యూపీలో జరిగిన కల్కి ధామ్ శంకుస్థాపన కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ పరిధిలోని ఐంపోద కాంబోహ్‌లోని శ్రీ కల్కి ధామ్ ఆలయానికి ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కల్కి ధామ్‌కు శంకుస్థాపన చేయడం తనకు దక్కిన వరమని, ఈ ఆలయం భారతీయుల విశ్వాసానికి మరో కేంద్రంగా అవతరిస్తుందని అన్నారు. ఇక్కడి ప్రజల 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత కల్కి ధామ్‌కు శంకుస్థాపన చేసే అవకాశం తనకు లభించిందని మోదీ పేర్కొన్నారు. తన కోసమే కొందరు మంచి పనులు వదిలి వెళ్లారని, భవిష్యత్తులో ఏ మంచి పని మిగిలిపోయినా మహనీయులు, ప్రజల ఆశీస్సులతో వాటిని పూర్తి చేస్తామన్నారు. ఈ ఆలయంలో పది గర్భాలయాలు ఉంటాయని తెలిపారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి అని, ఈ రోజు మరింత పవిత్రమైనదని, ఈ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా మారుతుందని అన్నారు. ఒకవైపు దేశంలోని యాత్రా స్థలాలను అభివృద్ధి చేస్తూనే, మరోవైపు నగరాల్లో అత్యాధునిక మౌలిక సదుపాయాలను కూడా కల్పిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

మూసీ అభివృద్ధిపై సీఎం సమీక్ష

మొదటి పేజీ తరువాయి...

సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తమ మధ్య విభజన చేయాలని సూచించారు. తన విదేశీ పర్యటనల అనుభవాన్ని పంచుకుంటూ, బ్రిటన్‌లోని లండన్‌లోని థేమ్స్, దుబాయ్‌లోని ఇలాంటి ప్రాజెక్టుల తరహాలో ప్రపంచ కంపెనీలు ఈ పనులను చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని రేవంత్ రెడ్డి చెప్పారు. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రతిపాదనలపై చర్చించేందుకు గ్లోబల్ ప్లానింగ్, ఇంజినీరింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సంస్థ మెయిన్‌హార్డ్ గ్రూప్ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ ఫిబ్రవరి 6న భేటీ అయిన విషయం తెలిసిందే. మూసీ రివర్ ఫ్రంట్‌ను 55 కిలోమీటర్ల పొడవునా వచ్చే మూడేళ్లలో అన్ని వర్గాల ప్రజలకు అనువైన ఐకానిక్ డిజైన్‌తో అభివృద్ధి చేయాలని సోమవారం అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. అన్ని వర్గాల వారి సౌకర్యార్థం అమ్యూజ్‌మెంట్ పార్కులు, జలపాతాలు, పిల్లల వాటర్ స్పోర్ట్స్, స్ట్రీట్ వెండర్ జోన్, వ్యాపార ప్రాంతాలు, షాపింగ్ మాల్స్ వంటి వాటిని డిజైన్ చేయాలని చెప్పారు. దేశంలో లేదా విదేశాల్లో ఎక్కడైనా చేపట్టిన రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను కూడా అధ్యయనం చేయాలని అధికారులను కోరారు. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధిలో ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడంతో ఆకస్మిక వరదల నిర్వహణకు వర్షపు నీటిని మూసీలోకి మళ్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాజెక్టును పీపీపీ విధానంలో చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

రైతు సంఘాలకు కేంద్రం కొత్త ప్రతిపాదన

మొదటి పేజీ తరువాయి...

మార్చ్ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు రైతు నాయకులు తెలిపారు. కేంద్ర మంత్రులతో ఆదివారం చర్చల అనంతరం రైతులు ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్త ప్రణాళికలను ప్రతిపాదించడంతో దానిని అధ్యయనం చేసేందుకు రాబోయే రెండు రోజుల పాటు చలో ఢిల్లీని వాయిదా వేసినట్లు చెప్పారు. రైతు నాయకులందరితో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయం రైతు సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండా, వాణిజ్యం పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్, హోం వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ చండీగఢ్లో ఆదివారం రైతు నాయకులతో నాల్గో విడత చర్చలు జరిపారు. కనీస మద్దతు ధర, చట్టపరమైన హామీ, రైతు సమస్యల గురించి వారు చర్చించారు. సహా వారి డిమాండ్లపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా గోయల్ విలేకరులతో మాట్లాడుతూ.. రైతులతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత ఐదేళ్లపాటు పప్పుధాన్యాలు, మొక్కజొన్న, పత్తి పంటలను ప్రభుత్వ సంస్థలు కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ (ఎన్సీపీఎఫ్) నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (నాఫెడ్) వంటి సహకార సంఘాలు కంది పప్పు, మినప పప్పు, ఎర్ర కంది పప్పు, మొక్కజొన్న పండించే రైతులతో ఒప్పందం కుదుర్చుకుంటాయని గోయల్ తెలిపారు. వచ్చే ఐదే

మైలార్‌దేవ్‌పల్లి చౌరస్తాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే తోలుకంటి ప్రకాష్ గౌడ్

బృందావన్ కాలనీలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

రాంబాగ్‌లో ఛత్రపతి శివాజీ మహరాజ్ యువ సమితి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ లో పాల్గొన్న బీఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ 394వ జయంతి వేడుకలు

బుద్వేల్, ఫిబ్రవరి19(ప్రభాత ఉదయం): రాంబాగ్ చత్రపతి శివాజీ మహారాజ్ యువ సమితి ఆధ్వర్యంలో అత్తాపూర్ మైదానంలో సోమవారం చత్రపతి శివాజీ మహారాజ్ 394 వ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు వందల సంఖ్యలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా నిర్వహించిన శోభా యాత్రలో పాల్గొన్నారు. కోలాటం నృత్యాలు, మహిళల ఆట పాటలతో ఈ ర్యాలీ కొనసాగింది. చత్రపతి యువ సమితి నాయకులు దత్తు, కేశవ్, గోవింద రత్నేష్, ఉ మాకాంత్, రాజు , దత్తు, సునీల్, మురారి, యోగేష్, లఖన్ , బాలాజీ, నాగేంద్ర పటేల్ తో పాటు ఎం. బాలసుబ్రమణ్యం, యు శ్రీకాంత్ ల నేతృత్వంలో ఈ ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో యువ నాయకుడు , బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పాల్గొని చత్రపతి శివాజీ మహరాజ్ పోరాట పట్టిమను, దేశం కోసం ఆయన చేసిన త్యాగాలు గుర్తు చేశారు. యువత దేశభక్తిలో ముందుండాలన్నారు. దేశ రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి , మామిడి సుధాకర్ రెడ్డి, వనం శ్రీరామ్ రెడ్డి, జాలిగం చిత్తారి, పెండ్యాల సాయి మల్లిక్ లు పాల్గొన్నారు. రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ విజయకుమార్ , ఏసీపీ లక్ష్మీనారాయణ, అత్తాపూర్ ఇన్స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సైలు శ్రీనివాస్ , నాగరాజు లు బందోబస్తును పర్యవేక్షించారు.

చత్రపతి శివాజీ మహారాజ్ గొప్ప దేశభక్తుడు : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

చత్రపతి శివాజీ మహారాజ్ గొప్ప దేశభక్తుడని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. మైలార్ దేవుపల్లి శివాజీ చౌక్ వద్ద, బృందావన్ కాలనీలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

యువత అన్యాయాలపై ధైర్యంగా పోరాడాలి : తోకల శ్రీనివాస్ రెడ్డి

యువత అన్యాయాలపై ధైర్యంగా పోరాడాలని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ , మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దేశ రక్షణ కోసం వీరోచితంగా పోరాడిన మహనీయుడు చత్రపతి శివాజీ మహారాజ్ అని కొనియాడారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని వివిధ బస్తీలు, కాలనీలలో జరిగిన చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీలను గౌరవించి, హిందూ ధర్మానికి వన్నెతెచ్చిన వీరుడు చత్రపతి శివాజీ మహారాజ్ అని గుర్తు చేశారు . హిందూ స్వరాజ్ స్థాపకుడు భారతదేశ గొప్ప యోధుడు శివాజీ అన్నారు. కార్యక్రమంలో నాయకులు రావుల భాస్కర్, దయానంద్ సతీష్ , దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్ రాంబాగ్ లో జరిగిన ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలలో పాల్గొన్న రాజేంద్రనగర్ అడిషనల్ డీసీసీ విజయ్ కుమార్

జయంతి వేడుకలలో ఛత్రపతి శివాజీ మహరాజ్ యువ సమితి ప్రతినిధులు

ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలలో రాజేంద్రనగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ పులి యాదగిరి, ఎస్ ఐ లు శ్రీనివాస్, నాగరాజు తదితరులు

ఉప్పర్‌పల్లిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు సామ ఇంద్రపాల్ రెడ్డి

హైదర్‌గూడ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు ఎన్. మల్లారెడ్డి, తదితరులు

ఎండు గంజాయితో పట్టుబడ్డ విశాల్ సింగ్

ఎండు గంజాయి తరలిస్తున్న ఒకరి అరెస్ట్

బుద్వేల్, ఫిబ్రవరి19(ప్రభాత ఉదయం) : నార్సింగ్ నుంచి పుప్పాలగూడ మార్గంలో ఆదివారం సాయంత్రం శంషాబాద్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జి దేవేందర్ రావు నిర్వహించిన వాహనాల తనిఖీలలో ఓ వ్యక్తిని ఆరెస్ట్ చేశారు . అతను హెూండా యాక్టివా ద్విచక్ర వాహనం లో 520 గ్రాముల ఎండు గంజాయిని తరలిస్తున్నట్లు కనుగొన్నారు. విచారణలో అతని పేరు లోయర్ దూల్పేట్ కు చెందిన విశాల్ సింగ్ (38) గా గుర్తించారు . అతని నుంచి 520 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని తరలిస్తున్న టీఎస్ 13 ఎఫ్ ఏ 6253 నెంబర్ హెూండా యాక్టివా ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితుని రిమాండ్ కు తరలించారు.

ఎండు గంజాయితో పట్టుబడ్డ విశాల్ సింగ్

ఎండు గంజాయి తరలిస్తున్న ఒకరి అరెస్ట్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి19(ప్రభాత ఉదయం) : నార్సింగ్ నుంచి పుప్పాలగూడ మార్గంలో ఆదివారం సాయంత్రం శంషాబాద్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జి దేవేందర్ రావు నిర్వహించిన వాహనాల తనిఖీలలో ఓ వ్యక్తిని ఆరెస్ట్ చేశారు . అతను హెూండా యాక్టివా ద్విచక్ర వాహనం లో 520 గ్రాముల ఎండు గంజాయిని తరలిస్తున్నట్లు కనుగొన్నారు. విచారణలో అతని పేరు లోయర్ దూల్పేట్ కు చెందిన విశాల్ సింగ్ (38) గా గుర్తించారు . అతని నుంచి 520 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని తరలిస్తున్న టీఎస్ 13 ఎఫ్ ఏ 6253 నెంబర్ హెూండా యాక్టివా ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితుని రిమాండ్ కు తరలించారు.

నృత్యం చేస్తున్న విద్యార్థునులు

ఎన్ సి సి విద్యార్థులతో నటుడు సోను

ప్రజలకు నమస్కరిస్తున్న నటుడు సోను, చిత్రంలో ఎంపీ రంజిత్ రెడ్డి ,ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

ప్రజలకు మెరుగైన వైద్యం, విద్య అందించడానికి సహకారం అందిస్తా

సినీ నటుడు, సమాజ సేవకుడు సోను సూద్

శంషాబాద్ లో దాత కందకట్ల సిద్దు రెడ్డి నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ప్రారంభించిన సోనుసూద్.

పాల్గొన్న ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.

శంషాబాద్,ఫిబ్రవరి 19. (ప్రభాత ఉదయం) తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రజలకు మెరుగైన విద్య. వైద్యాన్ని అందించడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ప్రముఖ సినీ నటుడు సోనుసూద్ స్పష్టం చేశారు. శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని సిద్ధాంతి బస్సులో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను స్థానిక వ్యాపారవేత్త కందకట్ల సిద్దు రెడ్డి దాదాపు 70 లక్షల రూపాయలు వెచ్చించి కార్పొరేట్ స్థాయి పాఠశాలగా తీర్చిదిద్దారు. ఈ పాఠశాలను ప్రముఖ సినీ నటుడు సోనుసూద్ సోమవారం . చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు రంజిత్ రెడ్డి. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. స్థానిక కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల వద్ద ఏర్పాటుచేసిన లోగోను వారు ఆవిష్కరించారు. అనంతరం సోనుసూది మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాలతో తనకు ఎంతో అనుబంధం ఉన్నదని తన భార్య తెలుగు అమ్మాయి అని తెలిపారు . ప్రభుత్వ పాఠశాలలు. ఆస్పత్రుల్లో కావలసిన సౌకర్యాలను కల్పించడానికి తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానని స్పష్టం చేశారు. పాఠశాల అందుబాటులో లేక ఏ ఒక్క విద్యార్థి చదువు మానేసిన అది సమాజానికి ఎంతో కీడు చేస్తుందని. వైద్యం అందక ఒక ప్రాణం పోయినా అది తీరని లోటుగా మిగులుతుందని అన్నారు. ఆసుపత్రుల్లో వైద్య పరికరాలు లేని పక్షంలో అందించడానికి కూడా తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. సినిమాల కన్నా ప్రజల మధ్యన ఉండి సేవ చేయడం ద్వారా ఎంతో సంతృప్తి లభిస్తుందని అన్నారు. కందకట్ల సిద్దు రెడ్డి పాఠశాల భవనాన్ని నిర్మించిన విషయాన్ని మాధ్యమాల ద్వారా తెలుసుకొని అతడిని అభినందించడం జరిగిందని అన్నారు. సమాజానికి పనికి వచ్చే కార్యక్రమాలు చేపట్టే వారికి తాను ఎప్పుడూ అండగా ఉంటూ అభినందిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమం అనంతరం ఎన్సిసి విద్యార్థులతో పాఠశాల విద్యార్థులతో కొద్దిసేపు సరదాగా గడిపారు. వారికి పాఠశాల బ్యాగులను అందించి వారితో ఫోటోలు దిగారు. ప్రజలకు మేలు చేయాలని నా ఆశయం. కందకట్ల సిద్దు రెడ్డి . ప్రజలకు సేవ చేయాలనేదే తన ఆశయమని సంపాదించిన దాంట్లో కొంత భాగం ప్రజాసేవకు వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సినీ నటుడు సంఘ సేవకుడు సోనుసూద్ తనకు ఆదర్శమని. తన తల్లి బుచ్చమ్మ ఆశీస్సులతో ప్రజలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని సిద్దు రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైర్ పర్సన్ కొలను సుష్మ మహేందర్రెడ్డి. వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్. నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్. మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా సిద్దేశ్వర్. వర్తమాన సినీ నటుడు ఇంద్రసేన దీప మల్లేష్. సంజయ్ యాదవ్. అమృతా రెడ్డి. స్థానిక నాయకులు దేవరపల్లి బుచ్చిరెడ్డి. కొనమొల్ల శ్రీనివాస్. చేవెళ్ల ప్రసాద్. జి వై ప్రభాకర్ ఎలుగని నరేందర్ గౌడ్. పలువురు కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థు లను ఉద్దేశించి ప్రసంగిస్తున్న నటుడు సోను

విద్యార్థులకు కిట్స్ అందజేస్తున్న సోను

పాఠశాలలో ప్రదర్శనలు ప్రారంభి స్తున్న నటుడు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

శివాజీ జయంతి సందర్భంగా మధురానగర్‌లో ఊరేగింపు

శంషాబాద్. ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం) వీర శివాజీ జయంతి సందర్భంగా శంషాబాద్ పట్టణంలోని మధుర నగర్ లో సోమవారం రాత్రి భారీ ఊరేగింపు నిర్వహించారు. శివాజీ అభిమాన సంఘం నాయకులు అరుణ్ యాదవ్. బజరంగ్ ఆధ్వర్యంలో కురవీధుల్లో శివాజీ చిత్రపటాన్ని ఊరేగించారు. డీజే ఏర్పాటు చేసి శివాజీ గీతాలను ఆలపిస్తూ భారత్ మాతాకీ జై అనే నినాదాలు చేస్తూఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మధుర నగర్ కాలనీకి చెందిన ప్రముఖులు యువజన సంఘాల వారు పాల్గొన్నారు.

గద్వాల నూతన మున్సిపల్ కమిషనర్ శంకర్ సింగ్ కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

గద్వాల మున్సిపల్ కమిషనర్ శంకర్ సింగ్ బాధ్యతల స్వీకరణ

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం)గద్వాల మున్సిపల్ కమీషనర్ గా డి.శంకర్ సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికల బదిలీలో భాగంగా గద్వాల మున్సిపల్ కమీషనర్ నర్సింహ్మ వరంగల్ జిల్లాకు బదిలీ కాగ అయన స్థానంలో రంగారెడ్డి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న శంకర్ సింగ్ గద్వాల మున్సిపల్ కమీషనర్ గా బదిలీపై వచ్చారు. ఈ మేరకు గద్వాల మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గద్వాల మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, సిబ్బంది సహకరించాలని ఆయన కోరారు. అనంతరం సిబ్బంది కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలియజేశారు.



విద్యార్థి ఆదిత్య గీసిన దేశ ప్రముఖుల చిత్రాలు

శివాజీ చిత్రాన్ని గీస్తున్న విద్యార్థి ఆదిత్య

అద్భుత చిత్రాలు గీస్తున్న విద్యార్థి ఆదిత్య

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 19 (ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లి చైతన్య విలాస్ కాలనీకి చెందిన విద్యార్థి ఆదిత్య చిత్రలేఖనంలో అద్భుతమైన చిత్రాలను తీస్తూ రాణిస్తున్నారు. ఆదిత్య పదవ తరగతి చదువుతున్నాడు. విద్యార్థి ఆదిత్య చదువులో రాణిస్తూనే తనకున్న ఆసక్తి చిత్రలేఖనంపై దృష్టి సారించి దేశ ప్రముఖుల చిత్రాలతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం చిత్రాలను గిస్తూ ప్రతిభను చాటుతున్నారు . చిత్రలేఖనంలో రాణిస్తున్న విద్యార్థి ఆదిత్యను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కాలనీ ప్రతినిధి మహేష్ అన్నారు.

ప్రజాసమస్యలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

కూకట్‌పల్లి,ఫిబ్రవరి19 (ప్రభాత ఉదయం): జిహెచ్ఎంసి కౌన్సిల్ హాల్ లో జరిగిన బల్దియా సమావేశంలో సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో నెలకొన్న పలు సమస్యలు , చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ గ్రేటర్ సమావేశంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... ప్రజా పాలన అని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం ప్రజలకు కనీస అవసరాలు కల్పించలేకపోతుందిని, కాలయాపన చేస్తూ, అభివృద్ధి ని విస్మరిస్తుందని, గత 3 నెలల నుండి కాలనీ లలో సరిగ్గా వీధి దీపాలు లేవని, పారిశుధ్యం, రోడ్డు, డ్రైనేజీ, వంటి పనులు చేయకుండా వ్యవస్థను నిర్వీర్యం చేశారని, గొప్పకు ఐఎఎస్ అధికారులను జోనల్ కమిషనర్లు గా నియమించడం జరిగినదని ఎంతో సంతోషించాంకానీ, చక్కటి పాలన అందుతుందని సంతోషించాం కానీ వారికి ఒక్క రూపాయి పని లేని వ్యవస్థను అప్పజెప్పారని, నిధులు మంజూరు చేయకుండ చేస్తున్నారని, గతంలో గత బీఆర్ఎస్ ప్రభుతం హయాంలో నిర్వహణ కు నెలకు రూ. 8 కోట్ల నిధులు మంజూరు అయ్యేవని ఇప్పుడు రూ. 4 కోట్లు విడుదల చేయకుండా వ్యవస్థ నిర్వీర్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇకనైనా ప్రజాసమస్యలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధిని వేగవంతం చేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడలని, అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని ఆయన కోరారు.

పశువుల సంతలో సిబ్బంది చేతి వాటం

నిబంధనలకు విరుద్ధంగా మార్కెట్ రుసుము వసూళ్లు

గద్వాల, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం)కొన్ని దశాబ్దాలుగా గద్వాల్ మార్కెట్ యార్డు ఆవరణలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పశువుల సంతలో పెద్ద ఎత్తున క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. వివాహాది శుభకార్యాలకు మేకలు, గొర్రెలు, గొర్రె పొట్టేళ్లను సంతలో చౌకధరలకు పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తారు. గ్రామాల్లో మాంసం విక్రయించేవారు పెద్ద సంఖ్యలో మేకలు, గొర్రెలను కొనుగోలు చేస్తారు. మార్కెట్ ఆదాయం పెంచుకోవడానికి ఆన్ లైన్ మిషన్ ద్వారా కొనుగోలుదారులకు రిషిప్టులు అందజేసి మార్కెట్ రుసుము కిందా డబ్బులు వసూళ్లు చేస్తోంది. కాని నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు చేస్తున్నారని కొనుగోలు దారులు ఆరోపిస్తున్నారు. గద్వాల పట్టణంలోని గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ప్రతి సోమవారం నిర్వహించే పశువుల సంతకు వివిధ ప్రాంతాల నుండి మేకలు, గొర్రెలు, బర్రెలు, ఎద్దులను తీసుకువచ్చి క్రయ విక్రయాలు చేస్తుంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నూటికి ఒక్క రూపాయి చొప్పున కొనుగోలు చేసిన ఆవు, మేక, ఎద్దు, గేదెలకు వసూలు చేయాలి. అనగా ఐదువేలకు మేకను కొనుగోలుచేస్తే 50 రూపాయలు మార్కెట్ రుసుము ఆన్ లైన్ చీటీ చేసుకోవాల్సి ఉంటుంది. కొనుగోలుదారులకు వ్యవసాయ మార్కెట్ సిబ్బంది ఆన్ లైన్ రిషిప్టు అందజేసి వారి నుంచి నగదు తీసుకోవలసి ఉంటుంది. కాని నిబంధనలకు విరుద్ధంగా విక్రయదారుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. ప్రతి మేక, గొర్రెలను కొనుగోలు చేసిన వారి నుంచి రూ.100 వసూళ్లు చేస్తున్నారు. కాని ఆన్ లైన్ రిషిప్టులో మాత్రం రూ.50వరకే రిషిప్టు కట్ చేసి కొనుగోలుదారుల నుంచి అధిక వసూళ్లు చేస్తున్నట్లు కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. కేటిదొడ్డి మండాలనికి చెందిన ఓ వ్యక్తి గ్రామంలో నిర్వహించు దేవర కోసం గద్వాల పసువుల సంతలో రూ.10వేలు విలువ చేసే పొట్టేలును కొనగోలు చేయగా మార్కెట్ సిబ్బంది మార్కెట్ రుసుము కిందా ఆ వ్యక్తి నుంచి రూ.100 వసూళ్లు చేయగా, 50 రుపాయాలకు మాత్రమే రుసుము ఇచ్చినట్లు ఆరోపించారు. ఇది ఇలా ఉంటే సంతలో మార్కెట్ సిబ్బందితో పాటు ప్రైవేటు వ్యక్తులు గొర్రెలు,మేకలు కొన్న వారినుంచి ఎలాంటి రిషిప్టు ఇవ్వకుండా మార్కెట్ రుసుము వసూళ్లు చేస్తుండటం గమన్హారం. సంతలో ఎంత వసూలు చేస్తున్నారు? నిబంధనలకు లోబడి వసూలు చేస్తున్నారా లేదా పర్యవేక్షించాల్సిన అధికారులు తమ బాధ్యత మరచి తమ కేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ తతంగం చూస్తుంటే మార్కెట్ యార్డుకు రావలసిన ఆదాయాని సిబ్బంది కాజేస్తున్నట్లు అనుమానాలు బలంగా వినిపిస్తాయి. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై గద్వాల మార్కెట్ యార్డు సెక్రటరీ నరసింహ్మను వివరణ కోరగా మా దృష్టికి రాలేదని, ఎవరైనా అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

జోగులాంబను దర్శించుకున్న మంత్రి జూపల్లి, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీలు

జోగుళాంబ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ సరిత

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం)శ్రీ జోగుళాంబ అమ్మవారి ఆశీస్సులు తెలంగాణ ప్రజలపై ఉండాలని రాష్ట్ర అబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం ఐదవ శక్తిపీఠం అలంపూర్ శ్రీ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయం సందర్శించుకున్న మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర దేవాలయాలలో అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. అనంతరం షాహి ఫైల్వాన్ దుర్గా సందర్శించి చద్దర్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లు రవి, జడ్పీ చైర్ పర్సన్ సరిత, జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్, జిల్లా ఎస్పీ రితిరాజ్, వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుల్ల దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ధ్వజస్తంభం వద్ద మంత్రి, జెడ్పి చైర్మన్, ఎమ్మెల్సీలు

ఘనంగా ఎమ్మెల్యే మాధవరం జన్మదిన వేడుకలు

80 మంది మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

పంపిణీ చేసిన నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా

కూకట్‌పల్లి,ఫిబ్రవరి19 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కె పి హెచ్ బీ కాలనీ ధనలక్ష్మి సెంటర్ మైదానంలో సోమవారం నియోజకవర్గ హాట్రిక్ ఎమ్మెల్యే మాస్ లీడర్ మాధవరం కృష్ణారావు జన్మదినం సందర్భంగా ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి అతిథులుగా నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా మరియు స్థానిక కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు విచ్చేసి శిక్షణ పొందిన 80 మంది మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. పిమ్మట కేక్ కటింగ్ చేసి ఎమ్మెల్యే కు హార్దిక జన్మదిన శుభాకాంక్షలు మహిళలందరి తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిరంతరం ప్రజల అభివృద్ధి కొరకు పాటు పడుతూ ప్రజల నాడి తెలిసిన నాయకుడై పనిచేస్తూ వారి అవసరాలను ఎరిగి అందుకు అనుగుణంగా సౌకర్యాలను కల్పిస్తు ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోయే మహనీయుడుగా ఆయన నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, ఆ భగవంతుడు ఆయన్ని చల్లగా చూడాలని ప్రార్థిస్తున్నామన్నారు. గత మూడు నెలలుగా ఖర్చు స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచితంగా శిక్షణను పొందిన పేద మధ్య తరగతి మహిళలకు ఆయన తన సొంత ఖర్చుతో కుట్టు మిషన్లను అందించి ధాతృత్వాన్ని చాటుకున్నారని, మహిళలకు పెద్దపీట వేయడం హర్షణీయమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిహెచ్ ప్రభాకర్ గౌడ్, ప్రదాన కార్యదర్శి వెంకటేష్ చౌదరి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు శ్రీమతి అనిత శ్రీపాల్, వార్డ్ మెంబర్ పవన్ కుమార్, పాతురు గోపి, నాగేశ్వరరావు, లక్ష్మణ్, రంగమోహన్, శ్రీనివాస్ రెడ్డి, జాన్, రవెల్, దినేష్, జస్వంత్, సుభాష్ గౌడ్, సురేష్ గౌడ్, జిల్లా గోపాల్, రమణ, అశోక్, ఈ.అశోక్, ఉమాకాంత్, జయరాజ్, యాదిల్, ఖాదర్, ఫయాజ్, బందప్ప, భాస్కర్ రావు, సుశీల్, జిమ్ గోపాల్, రమేష్, లక్ష్మీ రాజ్యం, ధనలక్ష్మి, లక్ష్మి, అన్నపూర్ణ, ఎస్తేర్, శారద ఆర్పిలు అరుణ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.ల



ఎమ్మెల్యే కృష్ణారావు జన్మదిన సందర్భంగా మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

కూకట్‌పల్లి,ఫిబ్రవరి19 (ప్రభాత ఉదయం) ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపెట్ డివిజన్ లోని జనతానగర్ లో సోమవారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని దీన బందు కాలనీ లలో నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి అన్నప్రసాద కార్యక్రమం పాల్గొన్న నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

గద్వాల, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం)ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను గట్టు పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. గట్టు ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం గట్టు, తప్పెట్లమొర్సు గ్రామాలలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించి ట్రాక్టర్లను, జెసిబిలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రామకృష్ణాపురంలో సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ జెడ్ పి టి సి డాక్టర్ పి జె బాబు, పిఎసిఎస్ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

కొత్తకోట మాజీ జెడ్ పి టి సి డాక్టర్ పి జె బాబు

గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం నిరంతర కృషి చేస్తాం: మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ హయాంలోని అభివృద్ధి జరుగుతుందని కొత్తకోట మండలం మాజీ జెడ్ పి టి సి డాక్టర్ బి జె బాబు అన్నారు. సోమవారం మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో 15 లక్షల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులను డాక్టర్ పిజే బాబు, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.జె బాబు మాట్లాడుతూ... గత పదేళ్లలో అధికారంలో ఉన్న బి ఆర్ ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించి ప్రచారానికే పరిమితమైందని ఆరోపించారు. పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గారెంటీల పథకాలను తూచా తప్పకుండా అర్హులైన లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే జిఎంఆర్ నియోజకవర్గ అభివృద్ధి పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. రామకృష్ణాపురం గ్రామం పి ఎస్ సి ఎస్ మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే గ్రామ అభివృద్ధికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యల తో పాటు అంతర్గత రోడ్లు, వివిధ అవసరమైన భవనాలు, పేద ప్రజల సంక్షేమం కోసం అర్హులైన వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ

పంచాయతీ ప్రత్యేక అధికారి, డిప్యూటీ తహసిల్దార్ శివ, పంచాయతీ కార్యదర్శి జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శివరాములు, రైతు సంఘం అధ్యక్షులు కోలంట్ల వెంకటేష్ , గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగరాజు , సీనియర్ కార్యకర్తలు నరసింహ, ఘట్టన్న, మొగులన్న , భారతయ్య ,ఆంజనేయులు, కార్యకర్తలు మహిళా కార్యకర్తలు సుజాత, నాగేశ్వరమ్మ, భారతమ్మ , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ.. 3 తులాలు బంగారు, 4.5 లక్షల నగదు చోరీ

గద్వాల, ఫిబ్రవరి 19(ప్రభాత ఉదయం) జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రం శ్రీనివాస కాలనీలో నివసిస్తున్న ఉప్పరి శ్రీనివాస్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో మూడుతులాల బంగారు నగలు, రూ.4.50 లక్షల నగదు మాయం అయినట్లు బాధితులు సోమవారం గద్వాల టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉప్పరి శ్రీనివాసులు మిర్చి వ్యాపారి కావడంతో ఆదివారం ఇంటికి తాళాలు వేసి మిర్చి విక్రయించడానికి గుంటూరుకు వెళ్లాడు. సోమవారం ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగలకొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. దీంతో బీరువాలో పెట్టిన రూ.4.50లక్షల నగదు, 3తులాల బంగారు ఆభరణాలు చోరీ జరిగిందని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాని పరిశీలించి క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరించి, కేసు నమోదు చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.